రచన - ఫిబ్రవరి 2004

# అఘాతహృదయుడు

'వెళ్లాననకు, వెళ్తొస్తాననను - వెళ్ళగానే ఉత్తరం వ్రాయి, లేదా ఫోను చెయ్యి - నీ ప్రయాణం సుఖప్రదంగా జరగాలి, క్షేమంగా వెళ్ళి లాభంగా రా' - ఈ ఆదేశ, ఆశీర్వచనాల వెనుక ఆత్మీయుల అంతరంగాల్లో మొలకెత్తే భయాల కారణాలుంటాయి. ఆ భయానికి అనేక రూపాలున్నా అంతిమ స్వరూపం అకస్మిక మరణం లేదా అజ్ఞాత మరణం. ఎంత కాదనుకున్నా మనసు మూలల్లో దాగుని ఉండే ఈ భయాలు వ్యక్తం చేయలేనివీ, చేయకూడనివీ. అయిన వాళ్ళ మధ్య కన్నుమూసిన వాళ్ళ ఆత్మశాంతి సంగతి చెప్పలేం కాని, కావల్సిన వాళ్ళకి మనశ్శాంతి ఉంటుందనుకోవడం అపసవ్యం కాదు. మంచైనా, చెడైనా ఓ ధృవమైన వార్త తెలిస్తే తప్ప, గడపదాటి బయటకు వెళ్ళినవారు ఎప్పటికీ తిరిగిరాకపోతే ఆత్మీయులకు ఆందోళన తప్పదు. ఆవేదన ఇంతా, అంతా కాదు.

ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో నాగపూర్ దగ్గర, ఎదురుగా వచ్చే గూడ్స్ ట్రయిన్‌తో ఢీకొని జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయారన్న వార్తని, మధ్యాహ్నం రేడియో, టీవీ ప్రసారాలలో విన్న కొంతమందికి కాళ్ళూ, చేతూలూ చల్లబడి గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి.

ఢిల్లీ, హైదరాబాద్‌లతో సహా ఆ రెండింటిమధ్యా ఎక్స్‌ప్రెస్ ఆగే అన్ని స్టేషన్లకి ఆ కాళ్ళూ, చేతులూ చల్లబడ్డ వాళ్ళు పరుగెత్తారు. ఢిల్లీకీ, నాగపూర్‌కీ మధ్యనున్న స్టేషన్లలో దిగిన వాళ్ళూ, నాగపూర్ స్టేషన్లోనూ, నాగపూర్‌కీ హైదరాబాద్‌కీ మధ్యనున్న స్టేషన్లలో ఎక్కవలసిన వాళ్ళూ, 'అమ్మయ్య, అదృష్టం బావుండి బ్రతికిపోయాం!' అని సంతోషించారు. వాళ్ళు బ్రతికిపోయినందుకు వాళ్ళ ఆత్మీయులనబడే వాళ్ళలో కొందరు సంతోషిస్తే, మరికొందరు విచారించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ విచారణ కౌంటర్‌లో పన్జేసే నాగరాజు, కూతుర్ని కాన్వెంటు స్కూల్ నుంచి ఇంటి దగ్గర దిగబెట్టి, మధ్యాహ్నం రెండు గంటలతో ప్రారంభమయ్యే రెండో షిఫ్టు డ్యూటీ కోసమని పావుతక్కువ రెండింటికి స్టేషన్ చేరుకొన్నాడు. దూరదర్శన్ ధారావాహిక ప్రవాహాల్లో మునిగితేలే నాగరాజు భార్యకి వార్తలు వినే అలవాటు లేదు. అందుకనే ఈ ప్రమాద వార్త నాగరాజుకి స్టేషన్‌కి వెళ్ళిన తర్వాత కాని తెలియలేదు.

వంట్లో నలతగా ఉండి సెలవు తీసుకున్న స్టేషన్‌మాస్టర్ కులకర్ణికి, అసిస్టెంటు స్టేషన్ మాస్టర్ టెలిఫోన్లో ఈ వార్త గురించి చెప్పాడు. నూటొక్క డిగ్రీల జ్వరంతో నలుగుతున్న కులకర్ణి స్టేషన్‌కి పరుగెత్తి రంగంలోకి దుమికాడు. నాగపూర్ నుంచి కొంత ముఖ్యమైన సమాచారం తెలుసుకొన్నాడు.

ఇంజనూ, దాని వెనకనున్న ఆరు బోగీలూ పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటిలో రెండు జనరల్ బోగీలు, మిగిలిన నాలుగూ ఒకటి నుండి నాలుగు వరకూ నెంబర్లు కల స్లీపర్ కోచ్‌లు. ఆ ఆరు బోగీల ప్రయాణీకులలో చాలామంది మరణించారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. బ్రతికిఉన్నవారిని బయటకు తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తీసిన వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వెనుక బోగీలలోనూ అంతోఇంతో గాయపడ్డవారు చాలామంది ఉన్నారు. వారికి ప్రాథమిక చికిత్స జరుగుతోంది. గూడ్స్ ట్రైన్ కూడా బాగా దెబ్బతింది. రెండు ఇంజన్ల తాలూకు నలుగురు డ్రైవర్లూ, నాలుగు స్లీపర్ కోచెస్ పర్యవేక్షణలో ఉన్న ఇద్దరు కండక్టర్లూ మరణించారు.

ఈపాటి వివరాలు తెలుసుకొన్న కులకర్ణి విచారణ కౌంటరున్న గదిలోకి వెళ్ళాడు. అప్పటికే కౌంటర్ బయట ఈ ప్రమాదం సంగతి తెలిసిన కొందరు ప్రజలు గుమిగూడారు. వాళ్ళు రైల్వేని శాపనార్థాలు పెడ్తూ, నాగరాజుని నిలదీస్తున్నారు.

"జరిగిన ప్రమాదం వివరాలు మీకు తెలియదంటే ఎలా? రేడియో వాళ్ళకీ, టీవీ వాళ్ళకీ ఎలా తెల్సిందట?!"

"నాగపూర్ స్టేషన్ సిబ్బందిలో చాలామంది ప్రమాద స్థలానికి వెళ్ళుంటారు. ఢిల్లీ నుంచి ఇక్కడి వరకూ ఉన్న అన్ని స్టేషన్లకీ ఒక్కటొక్కటిగా వాళ్ళు సమాచారం అందించడానికి కొంత వ్యవధి అవసరం. దయచేసి కాస్త ఓపిక పట్టండి. త్వరలోనే వివరాలు తెలుస్తాయి" – నాగరాజు సమాధానమిచ్చాడు.

కులకర్ణి నాగరాజు పక్కగా నిలబడి తను వ్రాసిన వివరాల కాయితం అందించి నెమ్మదిగా అన్నాడు. "వారి ఆందోళనని మనం అర్థం చేసుకోవాలి. పోను, పోనూ సాయంత్రం బండి రావల్సిన సమయానికి గుంపు పెద్దదై అలజడి రేగవచ్చు. ఈరోజు ఈ ఉపద్రవ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే మనకి శాంతమే ప్రధానం. నాకు అదనంగా సమాచారం అందినప్పుడల్లా బెనర్జీ ద్వారా కబురంపుతూ ఉంటాను. మధ్య మధ్యలోనే నూవస్తూ, పోతూంటాను".

'నాగరాజుకి తన ముందున్న వివరాలు చూసి ఒక్కసారిగా కళ్ళు బైర్లుకమ్మాయి. వెంటనే నిభాయించుకొని "అలాగేసర్" అన్నాడు.

"మీలో మీరు గుసగుసలాడుకోవడమే గాని మా ఊసు పట్టించుకోవట్లేదు!" – కిటికీ బయట నుంచి ఎవరో గట్టిగా అరిచారు.

కులకర్ణి తన గదికి దారితీశాడు.

నాగరాజు విచారణ కౌంటర్‌కి పరిమితమైన లౌడ్ స్పీకర్ని ఉపయోగిస్తూ, నెమ్మదిగా, స్పష్టంగా వివరాలు చెప్పాడు.

జనాలు మరింతగా గుమిగూడారు.

"ఈ వివరాలెందుకూ, నెత్తినేసి కొట్టుకోడానికి తప్ప! మాక్కావల్సింది మరణించిన వాళ్ళ లిస్టు," అన్నాడో యువకుడు అక్కడి గుంపుకి నాయకత్వం వహిస్తూ.

"మీరన్నది సమంజసమే కాని, మృతుల జాబితా తయారుచెయ్యడమనేది గంటల్లో జరిగేపని

కాదు. రోజులూ, వారాలూ పట్టవచ్చు" అన్నాడు నాగరాజు.

"కనీసం ఎంతమంది ప్రమాదానికి బలైపోయారో చెప్పగలరా?" – ఆ యువకుడు వ్యంగ్యంగా అడిగాడు.

"దెబ్బతిన్న బోగీల్లోంచి కొనఊపిరితో ఉన్న ప్రయాణీకుల్నీ, విగతజీవుల శరీరాల్నీ బయటకు తీయడమనేది అంత సులువైనపని కాదు. ఇంకా బ్రతికి ఉన్నవారికి ప్రాణహాని కలగని విధంగా అతిజాగ్రత్తగా వ్యవహరించవలసి వస్తుంది. గాయపడ్డ ప్రయాణీకులు కొంతమంది ఆస్పత్రులకు తరలించబడి చికిత్స పొందుతున్నారు. మరణంతో పోరాడుతున్న వారిలో, ఎంతమంది బ్రతికి బట్టకడ్తారో ప్రస్తుతం చెప్పడం కష్టం," – నాగరాజు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

గుంపు పెరిగింది. దానితో గోల పెరిగింది. ఆలోపుగా కులకర్ణి నలుగురు రైల్వే పోలీసుల్ని, 'చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలకి భంగం కలగకుండా చూడండి' అని మరీ మరీ చెప్పి విచారణ కౌంటర్ వద్దకు పంపాడు.

"మాటలతో మభ్యపెడ్తున్నారు. కనీసం పాసింజర్ల లిస్టైనా ఉందా?" – ఓ యువతి ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో చెప్పలేని ఆందోళన.

జెనర్జీ వచ్చి నాగరాజు ముందర ఓ కాగితం ఉంచి వెళ్ళాడు.

"నా ప్రశ్నకు సమాధానం లేదు!" ఆ యువతి గాద్గికంగా అంది.

నాగరాజు ఆ కాగితంలోకి చూస్తూ, "ముఖ్యమైన అన్ని రైల్వేస్టేషన్లకీ టెలిఫోన్ల ద్వారా, రైల్వే టెలిగ్రాంల ద్వారా, ఫాక్స్ మెస్సేజీల ద్వారా పాసింజర్ల లిస్టు పంపించమని అభ్యర్థించడం జరిగింది," అన్నాడు నాగరాజు.

"పంపించాం అని చెప్పి కూర్చుంటే సరిపోదు. సమాచారం ఎప్పుడందేదీ చెప్పాలి!" అన్నాడు గుంపు నాయకుడు హెచ్చు స్వరంలో.

"ఎస్.ఎమ్.గారు టెలిఫోను వదలకుండా అదే ప్రయత్నంలో ఉన్నారు."

"అయినా తెలీకడుగుతానూ, ఒక్క బటన్ నొక్కితే కంప్యూటర్‌లో లిస్టు రావాలిగా?" – ఎవరో ఓ కాలేజీ కుర్రాడు ప్రశ్నించాడు.

"ఢిల్లీలో బండి బయలుదేరినప్పటి లిస్టుని తెలుసుకోడానికి కంప్యూటర్ లింక్ ద్వారా ప్రయత్నించారు. సాఫ్ట్‌వేర్‌లో కొన్ని భద్రతా అంశాల కారణంగా అది సాధ్యపడలేదు."

"ప్రతిదానికి మీ దగ్గర ఓ నెపం ఉంది. కంప్యూటర్లెందుకూ, శుద్ధ దండుగ!" – గుంపు నాయకుడన్నాడు.

"సార్, మీరు సావధానంగా వింటానంటే కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకువస్తాను. మీకు మీ వాళ్ళు ఏ ఏ బోగీలలో వస్తున్నారో కనక తెలిసుంటే, స్లీపర్ కోచెస్ ఒకటి నుండి నాలుగు వరకూ, ప్రాణాలు దక్కి బయటపడే వారి సంఖ్య తక్కువే అనుకోవచ్చు. బ్రతికున్నవాళ్ళు కూడా తీవ్రంగా గాయపడి ఉండొచ్చు. రెండు జనరల్ కంపార్ట్‌మెంట్ల విషయంలో కూడా ఇంతే. ఒక బోగీలోంచి మరో బోగీలోకి దారులుండడం వల్ల, కాలక్షేపానికి ఇతర బోగీల నుండి ఈ నాలుగింటిలోకి వచ్చిన దురదృష్టవంతులూ ఉండొచ్చు, లేదా ఈ బోగీల్లోంచి

యితర బోగీల్లోకి వెళ్ళి బ్రతికి బయటపడ్డ అదృష్టవంతులూ ఉండొచ్చు. అదేవిధంగా చివరి క్షణంలో ప్రయాణం రద్దుచేసుకొన్న అదృష్టవంతులూ ఉండొచ్చు, లేదా అత్యవసర పరిస్థితుల్లో మరొకరి పేరుమీదున్న టిక్కెట్లతో ప్రయాణం చేస్తూ ప్రాణాలు పోగొట్టుకొన్న దురదృష్టవంతులూ ఉండొచ్చు. పేరొకరిదీ, ప్రాణం మరొకరిదీ అయినప్పుడు ప్రయాణీకుల జాబితా, లేని కొన్ని చికాకుల్ని కలిగిస్తుంది."

"ఇలాంటివి ఏవో ఒకటీ, అరా కేసులుండొచ్చు. అలాగని పాసింజర్ లిస్ట్ వల్ల ప్రయోజనం లేదంటే ఎలా?"

"లేదనట్లేదు కాని, పాసింజర్ లిస్ట్ కూడా కొన్నిటికి సమాధానం చెప్పలేదు. ఉదాహరణకి ఇద్దరు ఆర్.కె.రావులుంటారు. ఒకరు తీవ్రంగా గాయపడ్తారు, మరొకరు మరణిస్తారు. ఆందోళన ఇద్దరి బంధువులకీ తప్పదు. ఇంకొన్ని విషయాలు వినండి. బండి ఢిల్లీ నుంచి బయలుదేరినప్పటి లిస్టు మరికొద్దిసేపట్లో రావచ్చు. కాని, బండి ఆగే స్టేషన్లు మధ్యలో చాలా ఉన్నాయి. అక్కడ జనాలు ఎక్కుతారు. దిగుతారు. కండక్టర్లు ఆయా స్టేషన్లలో ఇవ్వబడిన జాబితాలు తీసుకొని, కోటా బెర్తులూ, ఖాళీలుంటే అదనపు బెర్తులూ ప్రయాణీకులకి కేటాయిస్తారు. చివరికి ప్రయాణీకుల జాబితా గమ్యం చేరుకొనేసరికి కండక్టర్ల చేతుల్లో అప్‌డేట్ అవుతుంది. ప్రస్తుతవిషయానికొస్తే ఆ నాలుగు బోగీలకి చెందిన ఇద్దరూ కండక్టర్లూ ప్రాణాలు కోల్పోయారు. ఆ జాబితాలు దొరకాలి. దొరికినా అవి ఉపయుక్తంగా ఉండాలి. అలాగని మేం చేతులు ముడుచుకొని కూర్చోలేదు. ఆయా స్టేషన్లు కండక్టర్ల కందించిన జాబితాలు పొందడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి."

బెనర్జీ వచ్చి నాగరాజుకి మరో సందేశం ఇచ్చి వెళ్ళాడు. నాగరాజు జనాల్ని ఉద్దేశించి అన్నాడు.

"ఢిల్లీ నుంచి ఫాక్స్‌లో ప్రయాణీకుల జాబితా వస్తోంది. మరో అయిదు నిముషాల్లో ఆ జాబితాని నోటీసు బోర్డులో పెట్టడం జరుగుతుంది. అది బోగీల వారీగా రిజర్వ్‌డ్ ప్రయాణీకుల జాబితాయే కాని మరణించిన వారిది మట్టుకు కాదని గుర్తుంచుకోండి. కానైతే, ఒకటి నుండి నాలుగో నెంబరు వరకూ, స్లీపర్ కోచెస్‌లోని ప్రయాణీకుల పేర్లు తెలుస్తాయి. జనరల్ కంపార్ట్‌మెంట్లలోని ప్రయాణీకుల పేర్లు చెప్పడం అసంభవం."

బెనర్జీ లోపల్నుంచి వచ్చి మొత్తం ఎక్స్‌ప్రెస్ తాలూకు రిజర్వేషన్ జాబితాని నోటీసు బోర్డు మీద అంటించాడు. జనాలు ఒక్కసారిగా ఎగబడ్డారు. ఎగబడి, పేర్లు చూసుకొని ఏం చేస్తారన్నది నాగరాజుకి అర్థం కాలేదు. అయినా ఎవరి ఆదుర్దా వారిది. నాగరాజు మైక్‌లో అన్నాడు.

"మీరందరూ ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ కలయబడితే ఆలస్యం జరగడం తప్ప మీ ఆందోళన తీరదు. మీరు నిశ్శబ్దంగా ఉంటే నా దగ్గర ఉన్న కాపీలోంచి పేర్లు చదువుతాను."

గుంపు నాయకుడు జనాన్ని అదుపులో పెట్టాడు. తాము కలగజేసుకోకుండా ఉండడమే ఉత్తమమని కర్రబొమ్మల్లా నిల్చుండి పోయారు రైల్వే పోలీసులు.

నాగరాజు ఒక్కొక్క పేరు నెమ్మదిగా, స్పష్టంగా రెండేసిసార్లు చదవసాగాడు. గంటకి పైగా

సమయం పట్టింది. ఆ తర్వాత, బెనర్జీ తీసుకువచ్చిన మరో సమాచారం నాగరాజు జనాలకి తెలియజేశాడు.

"ఈ ఘోర ప్రమాదాన్ని గురించి వార్తల్లో వినో, కర్ణాకర్ణిగా వినో మీలో చాలామంది ఇక్కడకు వచ్చారు. ఈవార్త వినని వాళ్ళు తమ బంధువుల్ని రిసీవ్ చేసుకోడానికి బండి వచ్చే సమయానికి సాధారణంగా వస్తారు, ఊరు చేరుకొన్న వాళ్ళు ఇళ్ళకు రాకేం చేస్తారని. ఈ వార్త వినని చాలా మంది ఇళ్ళలోనే కూర్చునే విషయం కూడా సాధారణంగా జరిగేదే. ఈ రాత్రికి గాని, రేపటికిగాని మీడియా ద్వారా అందరికీ తెలిసే అవకాశముంది. రైల్వేవారు రేపు సాయంత్రం సికింద్రాబాద్ నుంచి నాలుగు బోగీలూ, ఢిల్లీ నుంచి నాలుగు బోగీలు నాగపూర్ వెళ్ళే ఒకటి రెండు ట్రైన్లకి అదనంగా తగిలిస్తున్నారు."

"ఎందుకని? మేం వెళ్ళి మావాళ్ళ శవాల్ని గుర్తుపట్టడానికా?" – ఏడుస్తూన్న ఓ వయసు మీరిన వ్యక్తి అన్నాడు.

"నేనడానికి సాహసించలేని మాట మీరే అన్నారు. చూడండి సార్, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణీకుల్ని పాసింజర్ లిస్టు సహాయంతో ఆనవాలు పట్టడం కొంతవరకే సాధ్యం. మృతుల వస్త్రాలలో మొదటగా టికెట్ ఉండాలి. అది వారిదే అయి ఉండాలి. టికెట్ మీద పేరుండదు. ఆడో, మగో ఉంటుంది. వయసుంటుంది. సీటు నెంబరుంటుంది. సీరియల్ నెంబరుంటుంది. వీటి ఆధారంగా ప్రయాణీకుల జాబితాలోంచి పేర్లు తెలుసుకోవచ్చు. హేండ్‌బేగ్‌ల్లోనూ, బ్రీఫ్‌కేసుల్లోనూ చాలామంది టికెట్లు దాస్తారు. అవి చెల్లాచెదరై టిక్కెట్లు దొరకని పక్షంలో, మృతుల గుర్తింపు కష్టమౌతుంది. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన గుర్తింపు కార్డు లాంటిది ఏదైనా వంటిమీదనుంటే, ఆనవాలు పట్టడం సులువు. నుజ్జునుజ్జయి పోయిన శరీరాల్ని గుర్తించడంలో ఈరకమైన అయిడెంటి కార్డులు ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రయాణీకుల్లో ఇటువంటి మంచి అలవాటున్నవారు బహుకొద్దిమంది. అందుకని..."

"...ఇక ముందు ఓట్లు వేసే సమయంలోనే కాకుండా, రైల్వే ప్రయాణాలు చేసేటప్పుడు కూడా గుర్తింపు కార్డుని దగ్గరుంచుకొని వెళ్ళాలంటారు?!" – ఎవరో హేళనగా అన్నారు.

"కాదు సార్, గడప దాటి బయటకు వెడుతున్నప్పుడల్లా దగ్గరుంచుకోవాలి! ప్రాణాలు ప్రమాదాల్లోనే కాదు, గుండెపోట్లు వచ్చి కూడా పోవచ్చు!" – నాగరాజు కాస్త ఉద్రేకంగానే అన్నాడు.

"రాజకీయ నాయకులు ఆ పథకాన్ని దెబ్బతీశారు కాని, నిజానికి ఈయన అన్నట్లుగా అందరూ, అన్ని వేళలా గుర్తింపు కార్డులు దగ్గరుంచుకోవడం ఎన్నోవిధాల ఉపయోగిస్తుంది," అన్నాడో రైల్వే పోలీసు.

"నాగపూర్ వెళ్ళదలచిన వారందరూ ఉచితంగా రేపు సాయంత్రం ఆ స్పెషల్ బోగీలలో వెళ్ళవచ్చు. అక్కడి రైల్వే సిబ్బందీ, స్థానిక సేవాదళాలూ మీకు మృతుల దేహాల్నీ, ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న వారినీ చూపిస్తారు. అవసరమైన ఇతర ఏర్పాట్లు కూడా చేస్తారు. ఏది ఏమైనా రైల్వేవారు కలిగిస్తున్న ఈ సదుపాయాన్ని వినియోగించుకొని, వెళ్ళవలసిన వారు

నాగపూర్ వెళ్ళడం ఉత్తమం, ధర్మం కూడాను," అన్నాడు నాగరాజు.

"ప్రాణం పోయిన వాళ్లకీ, గాయపడిన వాళ్ళకీ నష్టపరిహారం సంగతి ఏమిటి?" – ఎవరో కాస్త నసుగుతూ అన్నారు. ఆ మాటల్నే గుంపు నాయకుడు, "అవును మరి నష్టపరిహారం సంగతి ఏమిటి?" అని గట్టిగా అడిగాడు.

"సార్, అది రైల్వే యంత్రాంగం నిర్ణయించేది కాదు, ప్రభుత్వంలోని రైల్వే మంత్రాంగం! మంత్రిగారి ప్రకటన కోసం ఎదురుచూడవలసిందే," అన్నాడు నాగరాజు, లేని నవ్వు బలవంతాన తెచ్చుకొంటూ.

జనాలు శాంతించారు. ఒక్కరొక్కరుగా జనాలు కదలసాగారు. కొంతమంది మరోసారి నోటీసు బోర్డులోని జాబితా చూసుకొని మరీ కదిలారు.

" ఈవిషయమై, అంటే నాగపూర్ వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన బోగీల విషయమై రేడియో, టీవీల్లో వివరాలు చెప్పే నిమిత్తం మా ఎస్.ఎమ్.గారు చర్యలు తీసుకుంటున్నారు," అన్నాడు నాగరాజు.

వెళ్ళిపోతున్న జనాల్లో ఎవరో అన్నారు – "తప్పు వాళ్ళది కాబట్టి ఈ రోజు ఏదో కాస్త నిదానంగా సమాధానాలు చెప్పారు కాని, ఉత్తి రోజుల్లో అడిగితే ఉరిమి చూస్తారు నాయాళ్ళు!"

నాగరాజు ఆ మాటలు విని నిర్లిప్తంగా నవ్వుకొన్నాడు. వాళ్ళన్న మాటల్లో నిజం లేకపోలేదు. ఆ రాత్రి పదకొండింటి వరకూ జనాలు వచ్చి విచారణ చేస్తూ, రైల్వే వాళ్ళనీ, కౌంటర్ వెనుకనున్న నాగరాజునీ ఏవో మాటలంటూనే ఉన్నారు. చివరికెలాగైతేనేం సద్దుమణిగింది. కులకర్ణి పదకొండు దాటిన తర్వాత వచ్చాడు. కూడా బెనర్జీ, నైట్‌షిఫ్ట్ ఉమాపతీ ఉన్నారు.

"నువ్వు చాలా నేర్పుగానూ, ఓర్పుతోనూ జనాల్ని శాంతపరచి పంపిస్తోండడం చూసి, పదింటి షిఫ్ట్‌లో నీ జాగాలో ఉండవలసిన ఉమాపతిని వేరే పనుల్లో పురమాయించాను. మన స్టేషన్ గౌరవం కాపాడావు. నువ్వూ, బెనర్జీ ఇళ్ళకు పోయి విశ్రాంతి తీసుకోండి," అన్నాడు కులకర్ణి నాగరాజు భుజం మీద అప్యాయంగా చేయివేస్తూ.

ఉన్నట్టుండి నాగరాజు నిస్త్రాణగా కూర్చున్న కుర్చీలోంచి అంచు వరకూ దిగజారిపోయాడు. 'ఏమైందంటూ' కులకర్ణి నాగరాజు భుజాల కిందుగా చేతులు వేసి, పైకిలాగి కుర్చీలో సరిగా కూర్చోపెట్టాడు. పక్కనే నిల్చున్న ఉమాపతి బల్లమీదనున్న వాటర్ బాటిల్ తీసి, నాగరాజు మొహం మీద కాసిన్ని నీళ్ళు జల్లి, ఆపైన సీసాని నోటి కందించాడు.

రెండు గుక్కలు నీళ్ళు తాగి కాస్త తేరుకొన్న తర్వాత నాగరాజు గాద్గికంగా అన్నాడు – "విశ్రాంతి ఎలా తీసుకోగలను సార్? ఆ మరణించిన ఇద్దరు కండక్టర్లలోనూ ఒకరు నా తమ్ముడు."

ఉమాపతీ, బెనర్జీ, ఎస్.ఎమ్. కులకర్ణీ – కొండంత దుఃఖం కడుపులో దాచుకొని డ్యూటీ చేసిన నాగరాజు కేసి వెర్రిగా చూస్తూ ఉండిపోయారు!

దెబ్బతిన్న మనిషికి ఎదుటి వాడి బాధ అర్థమవుతుందనుకోవడం సత్యదూరం కాదేమో?

*('రచన' కథాపీఠం పురస్కారం అందుకొన్న కథ)*